క్లుప్తంగా

భగవద్గీతలోని అంశాలు తెలుసుకోవాలి



భగవద్గీత పంపిణీ చేస్తున్న దృశ్యం

పాములపాడు: భగవద్గీత లోని అంశాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక చింతలపల్లి కమిటీ అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో భగవద్గీత గ్రంథాల ప్రచారం చేశారు. ఆయన ఇంటి బయట దీపాలు వెలిగించడం పరమాత్మ శక్తి అని, అందరూ ఈ విషయాన్ని తెలుసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఆ కమిటీ సభ్యులు మునిదాసు, కుమార్ ఆచారి, నాగమద్దిలేటి, సుబ్బలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రహదారి పనులు



ప్రధాన రహదారికి ఒక వైపు సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: పట్టణంలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారి విస్తరణ పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పట్టణంలో రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు రోడ్డుకు ఇరువైపుల సీసీ రోడ్డు ఆరు అడుగుల వెడల్పుతో వేస్తున్నారు. పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తీరినట్టేనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న జేసీఎస్ ఇన్‌చార్జ్ ఎంఏ రజాక్

శ్రీశైలం: శ్రీశైలదేవస్థానం పరిధిలో రుద్రపార్క్ సమపంలోని గ్రౌండ్‌లో నిర్వహించిన మూడవత్ మల్లికార్జున నాయక్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటి విజేతగా ఫ్రెండ్స్ టీమ్ నిలిచింది. ఈ టీమ్‌కు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తరపున రూ.20 వేలు నగదు బహుమతిని మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ ఎంఏ రజాక్ సోమవారం అందజేశారు. రెండో విజేత ఎల్జీ స్టార్స్, మూడో విజేత మార్కెట్ రాకెట్స్, అలాగే నల్లమల టైగర్స్ టీమ్‌కు కూడా బహుమతులు అందజేశారు. అంతకుమునుపు క్రికెట్‌టోర్నమెంట్ ఆర్గనైజర్స్ ఎంఏ రజాక్‌ను శాలువాతో సత్కరించారు.

క్రీడాకారిణికి ఎమ్మెల్యే ప్రోత్సాహం



వర్షితకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: జంప్ రోప్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న క్వీన్స్ కప్ జంప్ రోప్ పోటీలకు గోపవరం గ్రామానికి చెందిన చెవుల వర్షిత ఎంపికైంది. విషయం తెలుసుకున్న ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సోమవారం వర్షితకు రూ.20వేలు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో గోపవరం సొసైటీ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, వర్షిత తల్లి ఓబులమ్మ పాల్గొన్నారు.

లడ్డూప్రసాదాల ట్రేలు బహూకరణ



స్టీల్ ట్రేలను అందజేస్తున్న దాతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న లడ్డూప్రసాద తయారీ విభాగానికి హైదరాబాద్‌కు చెందిన పి.సాయిబాబ, ఎం రవి కుమార్‌లు 14 స్టీల్ ట్రేలను విరాళంగా ఇచ్చారు. ఈ ట్రేలను ఏఈఓ మోహన్ సమక్షంలో దేవస్థానానికి అందజేశారు. దాతలు మాట్లాడుతూ లడ్డూ ప్రసాదాల తయారీ సందర్భంలో వినియోగించుకునేందుకు వీటిని అందజేసినట్లు తెలియజేశారు. వీటి విలువ సుమారు రూ.2,94,000 ఉంటుందని అన్నారు.

సున్నిపెంట వాసుల కల సాకారం

- ఎమ్మెల్యే చొరవతో గ్రామ పంచాయతీగా అవతరణ
- ప్రభుత్వ జీఓ విడుదల
- గ్రామంలో అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట వాసుల దశాబ్దాల కల సకారమయ్యింది. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చొరవతో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సున్నిపెంట గ్రామ పంచాయతీ పాలనకు రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జీఓ ఎంఎస్ నంబర్ 40ని జారీ చేస్తూ గత మే నెల 12న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో 208.74 ఎకరాల్లో ఉన్న గ్రామాన్ని పంచాయతీరాజ్ శాఖకు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులిచ్చింది. గ్రామంలో సచివాలయాల ఏర్పాటుతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

డ్యాం నిర్మాణ సమయంలో వలస..

1963వ సంవత్సరంలో శ్రీశైలం డ్యాం నిర్మాణ సమయంలో పనుల కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సొంత గ్రామాలను వదిలి వలస వచ్చిన వారు సున్నిపెంటలో స్థిరపడ్డారు. నాటి నుంచి నేటి వరకు ఈ గ్రామంలో వలసజీవులుగా నివస్తున్నారే తప్పా ఎవరికీ ఎటువంటి హక్కులు లేవు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2006 సంవత్సరంలో జీఓ ఎంఎస్ నంబర్ 2 ను జారీ చేస్తూ గ్రామపంచాయితీగా సున్నిపెంట గ్రామాన్ని ప్రకటించారు. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. తిరిగి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక గ్రామ పంచాయతీ కిందికి సున్నిపెంట గ్రామాన్ని తీసుకువచ్చారు.

ప్రజలకు అన్నిరకాల పౌరసేవలు

గ్రామపంచాయితీ కాకమునుపు గ్రామంలో నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య పనులు, గ్రామపరిపాలన, జనన, మరణాల ధ్రువీకరణ, వీధి లైట్ల నిర్వహణ వంటి పనులను జలవనరుల శాఖే చూసేది. బడ్జెట్ సక్రమంగా లేకపోవడంతో ఆయా పనులన్నీ అరకొరగా జరిగేవి. గ్రామపంచాయతీగా ఏర్పడిన తర్వాత సున్నిపెంటలో 3 గ్రామ సచివాలయాలు ఏర్పడడం, సచివాలయ సిబ్బంది వలంటీర్లు బాధ్యతలు చేపట్టి ప్రజలకు పౌర సేవలు అందిస్తున్నారు. పారిశుద్ధ్యం , వీధిలైట్లు, జనన, మరణ ఇతర సర్టిఫికెట్లను కూడా పంచాయతీ కార్యాలయం చూసుకుంటోంది. విద్యుత్ సరఫరా ఏపీ ఎస్పీడీసీఎల్‌కు, నీటి సరఫరాను రూరల్ వాటర్ స్కీమ్ శాఖకు అప్పగించడంతో ప్రజలకు అన్ని సేవలు అందుతున్నాయి. అంతేకాకుండా గ్రామ పంచాయతీగా ఏర్పడటంతో ఇంతవరకూ ప్రభుత్వ గృహాల్లో, స్థలాల్లో ఇల్లు కట్టుకొని జీవిస్తున్న వారికి ఆయా గృహాలపై సంపూర్ణ హక్కులు లభించనున్నాయి.

అభివృద్ధి పనులు..

సున్నిపెంట గ్రామంలో గ్రామసచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అన్ని రకాల పౌర సేవలను ప్రజలకు అందిస్తున్నారు. గ్రామంలో సీసీ రోడ్లను నిర్మించారు. రక్షిత తాగునీటి పథకం పనులను చేపట్టి, నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను నిర్మించారు.



సున్నిపెంటలోని గ్రామసచివాలయం

శుభపరిణామం



సున్నిపెంటను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయడం శుభ పరిణామం. శ్రీశైలం డ్యామ్ పనుల కోసం 1964వ సంవత్సరంలో సున్నిపెంటకు వచ్చాం. సొంత ఊర్లను వదులుకుని ఇక్కడే స్థిరపడ్డాం. గ్రామంలో జలవనరుల శాఖ నిర్వహణలో ఉండటంతో అభివృద్ధి కుంటుపడింది. గ్రామ పంచాయతీగా ఏర్పడటంతో అన్ని సమస్యలు పరిష్కారం కానున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన జీఓ అమలు చేస్తే రిటైర్డ్ ఉద్యోగులకు, దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్న వారికి వారునివసిస్తున్న గృహాలు వారికి సొంతమవుతాయి. – కె.తిప్పిరెడ్డి, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి, సున్నిపెంట

పంచాయతీ కావడం వల్ల అభివృద్ధి జరుగుతుంది



గతంలో సున్నిపెంట గ్రామపరిపాలన, నిర్వహణ జలవనరుల శాఖ పరిధిలో ఉండేది. ఆ శాఖలో ఉన్న అరకొర నిధులతో గ్రామపరిపాలన నిర్వహించేవారు. సున్నిపెంటను ప్రభుత్వం గ్రామపంచాయతీగా చేయడంతో పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణ, పలు గ్రామాభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఇప్పటికే అభివృద్ధి పనులపై సుమారు రూ.2 కోట్లకు పైగా ఖర్చు చేశాం. ఇక నుంచి ఇళ్ల స్థలాలు, దుకాణాలపై పన్నులు వేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం. – బాలునాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి, సున్నిపెంట

నేడు బ్రాహ్మణకొట్కూరులో 'పల్లెకు పోదాం'

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు సచివాలయం-1 పరిధిలో మంగళవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రవియాదవ్ సోమవారం తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు తప్పకుండా పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి అఖండ సీతారామ సంకీర్తన

ఆత్మకూరు: మండలంలోని బాపనంతపురం గ్రామంలో వెలసిన శ్రీరాజరాజేశ్వరమాత ఆశీస్సులతో ఈ నెల 13 నుంచి 27వ తేదీ వరకు అఖండ సీతారామ సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో శ్రీవెంగళరెడ్డి కాలనీ భగవాన్ రమణ మహర్షి దేవాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. లోక సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరుకావాలని కోరారు.

కార్తీక పూజలు..

నందికొట్కూరు: ఈ నెల 14 నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకు కార్తీక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య వాసవి మహిళా మండల కార్యవర్గ అధ్యక్షురాలు నాగకుమారి, ఆర్గనైజింగ్ కార్యదర్శి అనురాధ సోమవారం తెలిపారు. నెల రోజుల పాటు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో కార్తీక మాసంలో విశేష పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజు అమ్మవారి సన్నిధిలో జరిగే పూజల్లో భక్తులు పాల్గొన్నాలని కోరారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



మహానందికి విచ్చేసిన మేయర్ బీవై రామయ్య

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆది, సోమవారాల్లో పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. కర్నూలు నగర మేయర్, వైఎస్సార్ సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య మిత్రులతో కలిసి మహానందికి వచ్చారు. శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ముడియం చంద్రశేఖర్‌రెడ్డి మేయర్‌కు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయించారు. అలాగే తెలంగాణ రాష్ట్రానికి చెందిన జిల్లా న్యాయమూర్తి హనుమంత రావు దంపతులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. మహానందిలో రాయలసీమ జోన్ హోం గార్డ్స్ కమాండెంట్ మహేష్, కుటుంబ సభ్యులు పూజలు చేపట్టారు.

సాహిత్యాల్లో శ్రీశైలక్షేత్ర ప్రస్తావనపై పరిశోధనలు



అధికారులతో చర్చిస్తున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: తెలుగు, కన్నడం, తమిళం, సంస్కృతం, మరాఠీ సాహిత్యాలలోని శ్రీశైల క్షేత్ర ప్రస్తావనపై పరిశోధన చేసే విధంగా చర్యలు చేపట్టాలని శ్రీశైలం ఈఓ డి.పెద్దిరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం శ్రీశైలంలోని భ్రమరాంబా అతిథిగృహంలో శ్రీశైలక్షేత్ర పరిశోధన సంబంధిత అంశాలపై ఈఓ సమీక్షించారు. గత నెల 17న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన పరిశోధనా మండలి సమావేశంలో జారీ చేసిన అంశాల ప్రగతిపై చర్చించారు. ఈఓ మాట్లాడుతూ ఛాయాచిత్రాలతో శ్రీశైల ప్రాకారకుడ్యం విశేషాలను వివరించే గ్రంథముద్రణను వీలైనంత త్వరలో చేపట్టాలని ఆదేశించారు. ఘంటామఠంలో లభ్యమైన తామ్రశాసనాలను తగు వ్యాఖ్యానంతో ప్రచురించ తలపెట్టిన గ్రంథముద్రణ పనులను జనవరి నెలలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డా.వేదాంతం రాజగోపాల చక్రవర్తి, ఆలయ ఏఈవో ఐ.ఎన్.వి.మోహన్, శ్రీశైలప్రభ సంపాదకులు డా.సి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పగిడ్యాల: నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ మద్దమ్మ సోమవారం తెలిపారు. ఈనెల 14 నుంచి 20 తేదీ వరకు వారోత్సవాలు ఉంటాయన్నారు. 14న లైబ్రేరీలో బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న వారి సంస్మరణ, 17న కవిసమ్మేళనం, సెమినార్లు, 18న విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు, 19న దిశచట్టం, మహిళా సాధికారికతపై చర్చ 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

రేషన్ బియ్యం పట్టివేత

మిడుతూరు: మండల పరిధిలోని పీరుసాహెబ్‌పేట గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. ఆత్మకూరు మండలం అమలాపురం నుంచి బొలేరో వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించి 70 బస్తాల బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. ఖాజామోహిద్దిన్, సద్దాం హుసేన్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. బుజ్జి, అలీ అక్బర్, ముత్తు, మురళీ అనే నలుగురు నిందితుల గురించి విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం సమీపాన సోమవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఎన్. ఘణపురం గ్రామానికి చెందిన చాకలి స్వామన్న అనే వ్యక్తి ఉదయం పని నిమిత్తం అల్లంపూర్ గ్రామానికి స్కూటీపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బీరవోలు బోయ జయరాఘవనాయుడు పొలం వద్ద స్కూటీపై అదుపు తప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో స్వామన్నకు తీవ్ర గాయాలుకాగా.. 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

మహానంది: మండలంలోని బుక్కాపురం గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీనరసమ్మ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

జూపాడుబంగ్లా సచివాలయం-2 పరిధిలో ..

జూపాడుబంగ్లా: స్థానిక సచివాలయం-2 పరిధిలో మంగళవారం 'పల్లెకు పోదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు నిర్వహించే కార్యక్రమానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ మద్దతుదారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఆత్మకూరు: పట్టణంలోని ఎంపీపీ ఉర్దూ పాఠశాల రహమత్‌నగర్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కౌన్సిలర్లు హాజరవుతారన్నారు. కాలనీ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీ బరకసంజీవరాయ స్వామికి పూజలు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామికి సోమవారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వార్లకు ఉదయం అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, మన్యసూక్త హోమం, పల్లకీ సేవ తదితర విశేష పూజలను ఆలయ అర్చకులు నరహరి శర్మ, కిరణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలగనూరు గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి

నందికొట్కూరు/ఆత్మకూరు: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఆదివారం దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. భక్తులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కులమతాలకు అతీతంగా చిన్నా, పెద్దా తేడాలేకుండా బాణసంచా కాల్చి ఆనందోత్సహాలతో వేడుకలు జరుపుకున్నారు. ఆత్మకూరు రైతు సంఘం కార్యాలయంలో సోమవారం పలువురు రైతులు చైర్మన్ బైరాపురం మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.



ఆత్మకూరులో టపాసులు కాలుస్తున్న రైతు సంఘం నాయకులు

వెలుగోడులో టీడీపీకి షాక్

- 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఎజాస్ హుసేన్, తదితరులు

వెలుగోడు: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సొంత మండలంలో ఆ పార్టీకి భారీ షాక్ తగిలింది. 25 ఏళ్లుగా టీడీపీలో ఉన్న కుటుంబాలు వైఎస్ జగన్ పాలనకు ఆకర్శి తులై వైఎస్సార్‌సీపీ గూటికి చేరాయి. పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు ఎజాస్ హుసేన్‌తో పా టు 25 కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే శిల్పా కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎజాస్ హుసేన్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా టీడీపీలో ఉంటున్న మాకు ఎలాంటి గుర్తింపు లేకుండా పోయిందన్నారు. మా గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యారని వాపోయారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్శితులై వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో శిల్పా చక్రపాణిరెడ్డిని మళ్లీ ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని అభివద్ధిని కొనసాగించేలా తమ వంతు కృషి చేస్తామన్నారు.

పార్టీలో ప్రతి ఒక్కరికీ గుర్తింపు

పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఇస్తానని, అందరికీ అండగా ఉంటానని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో సయిద్ మహమ్మద్ సైఫ్, ఉసేన్ బాషా, రసూల్, సయ్యద్ కలాం, మాలిక్, వలి, రహిమాన్, ఉమేర్, కేశవ, మాబూ, రాజు, జగదీష్, విజయ్ బట్టు, హబీబ్, షఫీవుల్లా, అష్రాఫ్, రజీవ్క్, ఆఫ్రీద్, బాసిద్, మున్నా తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు: పట్టణంలోని ఎండబ్ల్యూ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జరిగి ఆర్టీసీ అధికారి షఫీ కుమారుడి వివాహ వేడుకకు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామ పంచాయతీ మజరా పెంచికల పల్లి గ్రామానికి చెందిన రామాపురం శ్రీనివాసగౌడు అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ ఆదివారం తెలిపారు.ఆయన మాట్లాడుతూ.. మద్దూరు గ్రామ పంచాయతీ మజరా కృష్ణానగర్ గ్రామానికి చెందిన దళిత మహిళ శ్రీనివాసగౌడు వద్ద రూ.2.50లక్షలు అప్పు తీసుకొని రూ.1.50లక్షలు చెల్లించిందన్నారు. కాగా మిగిలిన లక్షరూపాయలు చెల్లించడానికి 2 నెలల గడువు అడిగిందని చెప్పారు. గ్రామైక్య సంఘం సమావేశం నిమిత్తం ఈనెల 6న పెంచికలపల్లి గ్రామానికి ఆటోలో వెళ్తుండగా శ్రీనివాసగౌడు ఆమెను అడ్డగించి కులం పేరు తో దూషిస్తూ, కొట్టేట్ అవమాన పరిచాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోలుకోలేక యువకుడి మృతి

మిడుతూరు: వివాహం కాలేదని మనస్థాపంలో గడ్డి మందు తాగిన పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన యువకుడు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం రాత్రి మృతిచెందినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన పుల్లయ్య, గోవిందమ్మల రెండో కుమారుడు రవి(24) ఈనెల 3న గడ్డి మందు తాగాడు. విషయాన్ని తన స్నేహితులకు వాట్సప్ కాల్ చేసి సమాచారం అందజేశాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలుపగా చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రుద్రకోడులో నేటి నుంచి కార్తీకమాస పూజలు

ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలో వెలసిన శ్రీరుద్రకోడు పుణ్యక్షేత్రంలో మంగళవారం నుంచి కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆలయార్చకులు నల్లగుండ్ల నారాయణ సోమవారం తెలిపారు. ప్రతి రోజు వేకువజామున స్వామివారికి పంచామృతాభిషేకాలు, అమ్మవారు శ్రీ రుద్రాణి మాతకు కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ, కల్పవృక్షం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్షేత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని, వివిధ వాహనాల ద్వార క్షేత్రానికి చేరుకోవచ్చని తెలిపారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా ఈ నెల 27న లక్షదీపోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి రోజు కార్తీకదీపోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులకు కార్తీకపౌర్ణమి రోజు రుద్రకోడూరు క్షేత్రంలో రాత్రి స్వామివారి జ్యోతి దర్శనం ఉంటుందని, అయ్యప్ప స్వామి క్షేత్రంలో జ్యోతి ఎలా ప్రకాశవంతంగా భక్తులకు కనిపిస్తుందో, అలాగే కార్తీకపౌర్ణమి రోజున రుద్రకోడూరు క్షేత్రంలో కూడా దర్శనమిస్తుందని చెప్పారు. భక్తులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు క్షేత్రంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మహానందిలో ఆకాశదీపం పూజలు



మహానందిలో ఆకాశదీప పూజలు చేస్తున్న ఈఓ, పండితులు

మహానంది: కార్తీకమాసం పురస్కరించుకుని సోమవారం రాత్రి మహానందిలో ఆకాశదీపం ఏర్పాటు చేశారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు నాగేశ్వరశర్మ, అర్చకులు పూజలు చేశారు. కార్తీకమాసంలో ఆకాశదీపం దర్శనం చేసుకోవడం ద్వారా సకల పాపాలు తొలగిపోతాయని బ్రహ్మాండ పురాణంలో ఉన్నట్లు వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. కార్యక్రమంలో టి.ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి పల్లకీసేవ


మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. వేదపండితులు, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువుచేసి ఆలయ ప్రాకారాల్లో ఊరేగించారు.

ఓంకారంలో ఏర్పాట్లు

బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఈఓ ఎ.నాగప్రసాద్ తెలిపారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో సోమవారం ఆకాశదీపం వెలిగించారు.

కార్తీకమాసానికి కోనేరు సిద్ధం

మహానంది: మహానంది ఆలయంలోని రుద్రగుండం, బ్రహ్మ, విష్ణుగుండం కోనేరుల మరమ్మతులకు రూ. 80లక్షలు మంజూరైన విషయం తెలిసిందే. అందులో భాగంగా ముందుగా ఆలయం బయట ఎడమవైపు ఉన్న బ్రహ్మగుండం(చిన్నకోనేరు) పనులు పూర్తయ్యాయి. ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితో చర్చించి పునఃప్రారంభిస్తామని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.



పనులు పూర్తైన తర్వాత బయటి చిన్నకోనేరు

యోగాతో ఒత్తిడి దూరం

బొమ్మలసత్రం: యోగా చేయటం వల్ల పనిఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుందని నంద్యాల దిశ డీఎస్పీ మారుతీరావు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక పోలీస్టేషన్ ఆవరణలో జిల్లా కేంద్రంలో పనిచేసే పోలీసులకు యోగా శిక్షణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయటం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు సాత్విక గుణం లభిస్తుందన్నారు. ప్రముఖ యోగా గురువు రామ్‌దేవ్‌బాబా శిష్యుడు విజయవాడకు చెందిన మణికుమార్ శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. ఎస్సీ,ఎస్టీ డీఎస్పీ రామాంజి నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

19న హిందూ సమ్మేళనం

నంద్యాల(వ్యవసాయం): ఈ నెల 19వ తేదీన సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణా రెడ్డి, నగర కన్వీనర్ చింతలపల్లె వాసు తెలిపారు. సోమవారం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో వారు పోస్టర్లను విడుదల చేసి మాట్లాడుతూ కార్యక్రమానికి శివస్వామి, శ్రీనివాస మూర్తి, శ్రీ శివయోగేంద్ర సరస్వతి స్వామి పాల్గొంటారని చెప్పారు. ఉదయం పట్టణంలో భజన బృందాలతో శోభాయాత్ర నిర్వహించిన అనంతరం వివేకానంద ఆడిటోరియంలో సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. బాలవీరయ్య, సత్యంరెడ్డి, రవీంద్రకుమార్, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

మహానందిలో భక్తజన సందడి

మహానంది: అమావాస్య పూర్తై కార్తీకమాసం ప్రారంభం కావడంతో మహానందిలో సోమవారం భక్తజన సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. భక్తులరద్దీకి అనుగుణంగా ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఇన్‌స్పెక్టర్లు ముడియం చంద్రశేఖర్‌రెడ్డి, నాగభూషణం ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఆలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు